# రవీంద్ర గీతాంజలి
## అనువాదం:గాయత్రి



(గతసంచిక నుంచి తరువాయి)

*53*

**చుక్కలతో పొదిగి**

లెక్కలేనన్ని రంగుల రత్నాలతో
నీ కంకణం సుందరం!
కానీ, విప్పారిన గరుడుని రెక్కలలాగా
మెఱుపుల వంపుతో క్రోధారుణ సంధ్యా కాంతికి సరిపోలిన
నీ ఖడ్గం మరీ మనోహరం!
అంతిమ మృత్యు ఘడియలో
వేదన పరాకాష్ఠలో
జీవితపు ఆఖరి స్పందనలా
అది వణుకుతోంది
ఒక్క భీకర మెఱుపుతో
ప్రాపంచిక స్పృహను దహించే
హోమజ్వాలలా అది వెలుగుతోంది!
నక్షత్రమణులతో పొదిగిన
నీ కంకణం సుందరం!
కానీ, మేఘ ఘర్జనల ప్రభూ!
అత్యంత మనోహరంగా మలచబడి
ఊహించడానికీ, తలచడానికే
భీకరమైనది నీ ఖడ్గం!

***

*54*

**అడగలేదు నిన్నేమీ**

పేరైనా నీ చెవిన వేయలేదు
నీ వీడ్కోలున మౌనంగా నిల్చొన్నా
చెట్టు నీడా వొంగినచోట
బావిపక్కన నేనొంటరిగా నిల్చొన్నా,
కుండలనిండా నీరు నింపుకొని ఆడవాళ్ళు
ఇంటికెళ్తూ నన్ను పిలుస్తూ అరిచారు
"మాతో వచ్చేయి
పొద్దుకుంకి మిట్టమధ్యాహ్నం అవుతోంది
కానీ, నిర్లిప్తంగా అచేతనంగా
పరధ్యానంలో ఉండిపోయా!
దగ్గఱగా వచ్చినా నీ పద సవ్వడి నే వినలేదు
నన్ను చూసిన నీ నేత్రాలు విచారంగా ఉన్నాయి
అలసిన నీ గొంతుకతో మెల్లగా
"అహ! నే దప్పిక గొన్నాను. బాటసారిని అన్నావు.
పగటి కలలనుండి కదలి,
నా కుండలో నీరు నీ దోసిట పోశా
ఆకులు తలపై రాలినై
చూడని చీకటినుంచి కోకిల పాడింది
బాట మలుపున మల్లెలు గుబాళించాయి!
నా పేరు అడగనప్పుడు
సిగ్గుతో మాటలేకుండా నిల్చుండి పోయా
నేనేం చేశానని గుర్తుంచుకొంటావ్?
కానీ, దప్పిక తీర్చేందుకు
నీరివ్వ గలిగాననే స్మృతి
ఎదలో హత్తుకుపోయింది, తీయదనపు మడతలా!
పొద్దు దాటిపోయింది
పక్షులు అలసిన గొంతులతో ఆలాపిస్తున్నాయి!
వేప ఆకులు పైనుండి రాలుతున్నై
కూర్చుండి పోయా ఆలోచిస్తూ ఆలోచిస్తూ!

***

*55*

**నీ ఎద నిర్లిప్తంగా నీ కళ్ళపై నిద్ర ఇంకా**

ముళ్ళపొదలో పూవు పూచిందనే
వార్త నీకు చేరలేదా

లే, ఓ చైతన్యమా
సమయం వృథా కానీకు!
రాళ్ళ బాట చివర
ఎవ్వరెరుగని ఏకాంత సీమలో
సఖుడు ఒంటరిగా కూర్చొనున్నాడు
మోసగింపకు అతన్ని
లే, ఓ చైతన్యమా!
మధ్యాహ్నం సూరీడు తాపానికి
ఆకాశం వగరుస్తూ వణికితేనేం
మండే ఇసుక
దప్పిక తెర పరిస్తే నేం
నీ హృదయాంతరాళంలో
లేదాఆనందం!?
నీ ప్రతి పదఘట్టనకూ
బాటవీణ తీయని బాధాస్వరాన్ని
ఆలపించడం లేదా?

***

### *56*

**అలా నాలో నీ ఆనందం పరిపూర్ణం**

నీవు నా వద్దకు దిగి వచ్చావలా
స్వర్గ లోకాధిపా!
నే లేక ఎక్కడిది నీ ప్రేమ?
ఈ భాగ్యానికి భాగస్వామిని చేశావు
నా ఎదలో నీ పరమానందపు ఆటలనంతం
నీ ఇచ్ఛ నాలో మూర్తిమంత మవుతోందెల్లప్పుడూ!
మరి ఇందుకోసం
నా ఎదను లోబరుచుకునేందుకు
రాజాధిరాజువైన నీవు
అందాలతో పొదిగించుకున్నావు!
మరి ఇందుకోసం
నీ ప్రేమను ప్రేయసి ప్రేమలో
లయం చేశావు
ఇద్దరి సంయోగంలోనూ
నీవే కన్పడతావు!

***

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

POST YOUR COMMENTS